# సాక్షి
# విశాఖపట్నం

సోమవారం । 23 । జనవరి । 2023




**ఏసీఏ జట్టుకు మధురవాడ బాలుడు**

అండర్‌–14 ఏసీఏ జట్టుకు స్పిన్నర్‌ భాను స్వరూప్‌ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 8లో




**ఆరోగ్య ఆహార ప్రయాణం**

తన భార్య ఆరోగ్యం కోసం వచ్చిన ఆలోచనతో ప్రజ్ఞానంద్‌ స్టార్టప్‌ స్థాపించి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. 8లో



**వహ్వా.. బ్యూటీ.. క్యూటీ**

రైల్వే స్టేషన్‌ రోడ్‌లోని ఓ ఫంక్షన్‌ హాలులో నిర్వహించిన ఫ్యాషన్‌ షో ఆహూతులను విశేషంగా అలరించింది. 8లో

## న్యూస్‌రీల్‌

### రిపబ్లిక్‌ డేకి నలుగురు ఖైదీల విడుదల?

**ఆరిలోవ:** గణతంత్ర దినోత్సవానికి నలుగురు జీవిత ఖైదీలు విడుదలకానున్నట్లు తెలిసింది. సాధారణంగా గాంధీ జయంతి, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఖైదీలు క్షమాభిక్షపై విడుదలవుతుంటారు. గత ఏడాది నుంచి గణతంత్ర దినోత్సవానికి అమృత్‌ కా ఆజాద్‌లో భాగంగా తక్కువ శిక్ష పడిన వారిలో సత్‌ ప్రవర్తన కలిగిన వారిని విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఏడుగురు ఖైదీల జాబితాను ఇక్కడ జైల్‌ అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. ఆ జాబితాలో ఒకరిని అనర్హుడిగా ఉన్నతాధికారులు గుర్తించారు. మిగిలిన ఆరుగురిలో ఇద్దరికి ఇటీవల బెయిల్‌ లభించడటంతో విడుదలయ్యారు. మిగతా నలుగురు ఖైదీలు అమృత్‌ కా ఆజాద్‌లో భాగంగా విడుదలకు అవకాశం ఉన్నట్లు సమాచారం. వారిని ఈ నెల 26న విడుదల చేసే అవకాశం ఉంది.

### సికింద్రాబాద్‌–అగర్తల మధ్య స్పెషల్‌

**తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర):** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్‌–అగర్తల మధ్య వీక్లీ స్పెషల్‌ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్‌ డివిజన్‌ సీనియర్‌ డీసీఎం త్రిపాఠి తెలిపారు. సికింద్రాబాద్‌–అగర్తల(07030) వీక్లీ స్పెషల్‌ ప్రతి సోమవారం సాయంత్రం 4.35గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 4.40 గంటలకు బయల్దేరి ప్రతి గురువారం తెల్లవారు 3 గంటలకు అగర్తల చేరుకుంటుంది. ఈ స్పెషల్‌ ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో అగర్తలలో (07029) వీక్లీ స్పెషల్‌ ప్రతి శుక్రవారం ఉదయం 6.10గంటలకు బయల్దేరి ఆదివారం తెల్లవారు 3.05గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.25 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు సికింద్రాబాద్‌ చేరుకుంటుంది. ఈ స్పెషల్‌ ఫిబ్రవరి 10వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు నడుస్తుంది.

### నేడు 3 గంటలు ఆలస్యంగా కోరాపుట్‌ స్పెషల్‌

**తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర):** రాయగడ–విజయనగరం లైన్‌లో జరుగుతున్న పలు భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల వల్ల విశాఖపట్నం–కోరాపుట్‌ (08546) స్పెషల్‌ ఎక్స్‌ప్రెస్‌ సోమవారం మూడు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుందని వాల్తేర్‌ డివిజన్‌ సీనియర్‌ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖలో ఉదయం 6.30 గంటలకు బయల్దేరాల్సిన ఈ రైలు 9.30 గంటలకు బయల్దేరుతుందని పేర్కొన్నారు.

### 25న జాబ్‌మేళా

**కంచరపాలెం:** జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్‌ కెరీర్‌ సెంటర్‌లో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్‌ అధికారి(క్లరికల్‌) సిహెచ్‌ సుబ్బిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సినర్జీస్‌ కాస్టింగ్, వరుణ్‌ మోటార్స్, లక్ష్మీ కియా మోటార్స్, లక్ష్మీ హ్యుందాయ్‌ మోటార్స్, మ్యాంగో మోటార్స్, హెటిరో ల్యాబ్స్‌ లిమిటెడ్‌ కంపెనీల్లో 221 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ట్రైనీ, పెయింటర్స్, టెక్నీషియన్, సేల్స్, కన్సల్టెంట్, టెలీ కాలర్, సేల్స్‌ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్‌ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీల్లో ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆయా ఉద్యోగాల బట్టి నెలకు జీతం రూ.13,500 నుంచి రూ.25,000 వరకు ఉంటుంది. అభ్యర్థులు https:// www.ncs.gov.in/లో నమోదు చేసుకుని.. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన సూచించారు.

### డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**కంచరపాలెం:** ఉపాధి–శిక్షణ శాఖ ఆధ్వర్యంలో హెవీ వెహికల్‌ డ్రైవింగ్‌లో 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్‌ జి.శ్రీకాంత్‌ తెలిపారు. కంచరపాలెం పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ప్రారంభమయ్యే బ్యాచ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. 21 ఏళ్లు నిండి, లైట్‌ వెహికల్‌ డ్రైవింగ్‌ లైసెన్స్, హెవీ వెహికల్‌ ఎల్‌ఎల్‌ఆర్‌ ఉన్న అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని.. మరిన్ని వివరాలకు 91779 67397లో సంప్రదించాలని సూచించారు.

### సెమీస్‌కు గెలాక్సీ సీసీ

**విశాఖ స్పోర్ట్స్‌:** శ్రీకాకుళం డీసీఏ జట్టుపై గెలాక్సీ సీసీ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీస్‌కు చేరింది. ఆదివారం వైఎస్సార్‌ స్టేడియంలో జరిగిన క్వార్టర్‌ఫైనల్స్‌ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌ చేసిన శ్రీకాకుళం డీసీఏ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 302 పరుగులు చేసింది. గెలాక్సీ బౌలర్లు రవితేజ, జి.రెడ్డి చెరో రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా గెలాక్సీ సీసీ మరో నాలుగు బంతులుండగానే ఐదు వికెట్లు కోల్పోయి 306 పరుగులతో విజయం సాధించింది. గెలాక్సీ బ్యాటర్‌ శ్యామ్‌సాయి వెంకటేష్‌ 143 పరుగులతో నిలిచి జట్టుకు విజయాన్నందించాడు.

# కానిస్టేబుల్‌ పరీక్ష ప్రశాంతం

**91.74 శాతం హాజరు**



ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న సీపీ శ్రీకాంత్‌



అభ్యర్థులకు సూచనలిస్తున్న కానిస్టేబుల్‌



ఆంధ్రా యూనివర్సిటీ పరీక్ష కేంద్రం వద్ద బారులుదీరిన కానిస్టేబుల్‌ అభ్యర్థులు



బోర్డుపై సెంటర్లు పరిశీలిస్తున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రం సమీపంలో చెట్లకు వేలాడదీసిన బ్యాగులు

**అల్లిపురం :** పోలీస్‌ కానిస్టేబుల్‌ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 97 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు విశాఖ రీజియన్‌ నుంచి 48,684 మందికి గానూ 44,485 మంది హాజరయ్యారు. వారిలో 33,889 మంది పురుషులు, 10,596 మంది మహిళలు ఉన్నారు. విజయనగరం రీజియన్‌ నుంచి 6,088 మంది రిజిస్టర్‌ చేసుకోగా 5,763 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 4,390 మంది పురుషులు, 1,373 మంది మహిళలు ఉన్నారు. మొత్తంగా 91.74 శాతం హాజరు నమోదైంది. పరీక్ష కేంద్రాల వద్ద నగర పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల అడ్రస్‌లను సూచిస్తూ ముఖ్యమైన జంక్షన్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

**పరీక్ష కేంద్రాలను సందర్శించిన పోలీస్‌ కమిషనర్‌ శ్రీకాంత్‌**

నగర పోలీస్‌ కమిషనర్‌ సిహెచ్‌.శ్రీకాంత్‌ పాత జైలురోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. పరీక్ష జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ముగిసే వరకు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమలు చేశారు. మాల్‌ ప్రాక్టీస్, కాపీయింగ్‌ వంటి వాటికి అవకాశం లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించినట్లు సీపీ తెలిపారు. నోడల్‌ ఆఫీసర్లు డీసీపీ–1 సునీల్‌ సుమిత్‌ గరుడ్, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, క్రైం డీసీపీ జి.నాగన్న, అడ్మిన్‌ ఏడీసీపీ ఎం.ఆర్‌.కె.రాజు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.



పరీక్షకు సమయం కావడంతో పరుగులు తీస్తున్న అభ్యర్థులు

# ఐటీకి ఊపు

**ఐటీ రంగం అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఐటీ, ఐటీ ఆధారిత రంగాల్లో దిగ్గజసంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభిస్తుండగా.. మరిన్ని కంపెనీలకు ఎర్ర తివాచీ పరిచేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.** రెండు రోజుల క్రితం నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్‌ సమ్మిట్‌–2023 సదస్సులో ఐటీ రంగం అభివృద్ధికి విశాఖలో ఉన్న అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్‌ చేయడంతో.. మరిన్ని సంస్థలు ఇటుగా అడుగులు వేసేందుకు ఎదురు చూస్తున్నాయి.

- విశాఖ సమీపంలో ఐటీపార్క్‌
- భోగాపురం వద్ద 90.10 ఎకరాల్లో అభివృద్ధి
- అందుబాటులో 1.90 లక్షల చ.అడుగుల విస్తీర్ణం
- త్వరలో మరికొన్ని ఐటీ సంస్థల కార్యకలాపాలు



ఐటీ పార్క్‌ రానున్న కంచేరుపాలెం ప్రాంతం



మిలీనియం టవర్స్‌

**సాక్షి, విశాఖపట్నం:** విశాఖ నగరాన్ని ఐటీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి క్రమంగా ఫలిస్తోంది. ఐటీ, దాని ఆధారిత పరిశ్రమలైన ఇన్ఫోసిస్, డబ్ల్యూఎన్‌ఎస్, రాన్‌స్టాండ్‌ సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించగా.. అమెజాన్, విప్రో, ఐబీఎం సంస్థలు త్వరలోనే వైజాగ్‌లో అడుగు పెట్టనున్నాయి. మరిన్ని సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం పలికిన వేళ... ఆయా సంస్థలకు అవసరమైన మౌలిక వసతులు, వనరులు సిద్ధం చేసేందుకు కొత్త ఐటీ పార్క్‌ అభివృద్ధికి ప్రణాళికలు తయారయ్యాయి. ఇప్పటికే మధురవాడలోని ఐటీహిల్స్‌లో పదుల సంఖ్యలో పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీనికి అనుబంధంగా మరో ఐటీ హబ్‌ విశాఖకు సమీపంలో సిద్ధంకానుంది.

**భోగాపురం వద్ద 90.10 ఎకరాల్లో...**

ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక హబ్‌ని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం విశాఖ నగరానికి సమీపంలో ఉన్న భూమిని గుర్తించింది. భోగాపురం సమీపంలోని కంచేరుపాలెంలోని సర్వే నం.1లో 90.10 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్క్‌ ఏర్పాటు కానుంది. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు 53 కి.మీ, విజయనగరం రైల్వే స్టేషన్‌కు 32 కి.మీ దూరంలోనూ, ఎన్‌హెచ్‌–16కు 9 కి.మీ దూరంలో ఈ పార్క్‌ రాబోతోంది. ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో వస్తున్న ఐటీ పార్క్‌కు కావల్సిన పూర్తి వనరులు, వసతులు అందుబాటులోనే ఉన్నాయి. ఈ స్థల అభివృద్ధికి కార్యాచరణ రూపుదిద్దుకుంటోంది.

**ఐటీ హిల్స్‌లోనూ అందుబాటులో స్థలం**

ఓవైపు ప్రత్యేక ఐటీ పార్క్‌ అభివృద్ధికి శ్రీకారం చుడుతుండగా.. ప్రస్తుతం ఉన్న మధురవాడ ఐటీ హిల్స్‌లోనూ వెంటనే సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన స్థలం కూడా అందుబాటులో ఉంది. 1.90 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఆఫీస్‌ స్పేస్‌ కూడా సిద్ధం చేస్తున్నట్లు అధికారులు సంస్థలకు తెలిపారు. ఇందుకోసం మరో 1.20 లక్షల పార్కింగ్‌ స్థలం కూడా అందుబాటులో ఉంది. ఇక్కడ ఉన్న అవకాశాల్ని వినియోగించుకోవాలంటూ ప్రధాన ఐటీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసింది. విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించాలని ఆహ్వానాలు అందించింది.

**విశాఖలో ఐటీకి అవకాశాలు**



ఉద్యోగులు ఉన్న చోటికే సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించే సంస్కృతి ఐటీ రంగంలో మొదలైంది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉత్తరాంధ్ర పరిసర ప్రాంతాల్లోనే ఉన్నారు. అంటే.. విశాఖలోనే ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించే ఆస్కారం ఉంది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఐటీ పార్క్‌ని కూడా భోగాపురం వద్ద సిద్ధం చేయడం శుభపరిణామం. ఇవన్నీ పూర్తయితే కొత్త కంపెనీలు వచ్చేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒక్కో పరిశ్రమ అడుగులు వేస్తే.. విశాఖలోనే ఐటీ రంగం భవిష్యత్తు ఉంటుందనేది వాస్తవం.

– శ్రీధర్‌ కొసరాజు, ఐటాప్‌ రాష్ట్ర అధ్యక్షుడు

# వెయిటేజ్‌ కోసం నకిలీ సర్టిఫికెట్లు?

- కోవిడ్‌ నకిలీ సర్వీస్‌ సర్టిఫికెట్ల సమర్పణ!
- స్టాఫ్‌ నర్సు పోస్టుల భర్తీలో వెలుగుచూస్తున్న అక్రమాలు

**మహారాణిపేట:** స్టాఫ్‌ నర్సు పోస్టుల కోసం కొంత మంది అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి.. ఉద్యోగం పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పలు పోస్టుల భర్తీలో పలువురు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి.. ఉద్యోగాలు పొంది తర్వాత కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం ఇంకా తేలక ముందే.. స్టాఫ్‌ నర్సు పోస్టుల్లో కూడా నకిలీల బెడద ఉన్నట్లు తెలిసింది. వెయిటేజ్‌ మార్కుల కోసం కొంత మంది కోవిడ్‌ నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు సమాచారం. ఈ సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థుల నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్‌ చేస్తున్నారు.

కోవిడ్‌ కాలంలో పనిచేసిన నర్సులకు ప్రభుత్వం 15 వెయిటేజ్‌ మార్కులు కలిపే అవకాశం కల్పించింది. దీంతో అభ్యర్థులు దరఖాస్తుతో పాటు కోవిడ్‌ సమయంలో వివిధ ఆస్పత్రుల్లో ఏడాది కాలం పాటు పని చేసినట్టు సర్టిఫికెట్లు సమర్పించారు. దీని వల్ల అనర్హులు ఎంపిక అయ్యారన్న వాదన బలంగా వినిపిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి ఎక్కువగా నకిలీ సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిసింది. స్టాఫ్‌ నర్సుల భర్తీ ప్రక్రియలో భాగంగా 100 మార్కులకు ఎంపిక విధానం ఉండగా.. అందులో 75 మార్కులు విద్యార్హతలు, నర్సింగ్‌ విద్యకు కేటాయించారు. ఉత్తీర్ణత పొందిన ఏడాదికి ఒక మార్కు చొప్పున అభ్యర్థికి 10 మార్కుల వరకు ఇచ్చారు. కోవిడ్‌ సమయంలో ఆరు నెలల కాలం పనిచేస్తే 5 మార్కులు, ఏడాది కాలం పనిచేస్తే 10 మార్కులు, 18 నెలల కాలం పనిచేస్తే 15 మార్కులు వెయిటేజ్‌ ఇచ్చారు. దీనిని కొంత మంది అభ్యర్థులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. తక్కువ కాలం పనిచేసినా ఏడాది, 18 నెలల కాలం పాటు పనిచేసినట్టు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి.. దరఖాస్తుకు జత చేసినట్లు తెలిసింది. సర్వీస్‌ కాలం దిద్దడం లేదా వెనుక తేదీతో పనిచేసినట్లు సర్టిఫికెట్లు సృష్టించడం వంటి చర్యలకు దిగినట్లు సమాచారం. దీనిని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆసరాగా తీసుకుని ఎంపిక జాబితాలో అనర్హులకు చోటు కల్పించారు. అవసరం అయిన వారికి వెయిటేజ్‌ మార్కులు కలపకపోవడం, ఎలాంటి అర్హతలు లేని వారికి మార్కులు కలిపి అందలం ఎక్కించినట్లు సమాచారం. ఉద్యోగులు, ఎంపికైన కొంత మంది అభ్యర్థుల చర్యల వల్ల తమకు అర్హత ఉన్నా.. ఉద్యోగాలు రాలేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. 179 పోస్టులకు గానూ 172 మందితో అధికారులు జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందులో 136 మంది కౌన్సెలింగ్‌కు హాజరు కాగా.. 8 మంది ఉద్యోగంలో చేరేందుకు అయిష్టత చూపారు. 36 పోస్టులు వివిధ కారణాల వల్ల భర్తీ కాలేదు.

**ఆ వివరాలు డీఎంహెచ్‌వోలకే తెలుస్తాయి**

నకిలీ సర్టిఫికెట్ల అంశం నా దృష్టికి రాలేదు. ఒక వేళ నకిలీ సర్టిఫికెట్లు వచ్చి ఉంటే.. వాటి గురించి మాకు తెలియదు. కోవిడ్‌ సమయంలో ఎంత కాలం పనిచేశారో అన్న వివరాలు డీఎంహెచ్‌వోలకే తెలుస్తాయి. పనిచేసిన కాలానికి డీఎంహెచ్‌వోల ద్వారా వారికి జీతాలు చెల్లించారు. ఎంపికైన స్టాఫ్‌ నర్సుల వివరాలు డీఎంహెచ్‌వోలకు పంపిస్తాం. అన్ని అంశాలు పరిశీలన చేసి తర్వాతే వారిని విధుల్లోకి చేర్చుకోవాలి.

– డాక్టర్‌ ఉమా సుందరి, ప్రాంతీయ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ

# తెరవెనుక అసలు పోలీస్‌

- బీచ్‌ల్లో జంటల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్న నకిలీ కానిస్టేబుల్‌
- విచారణలో వెలుగులోకి దిశ పోలీస్‌ స్టేషన్‌ డ్రైవర్‌ పాత్ర



నకిలీ కానిస్టేబుల్‌ సురేష్‌

**ఆరిలోవ:** బీచ్‌ల్లో సందర్శకులను బెదిరించి డబ్బులు వసూళ్లు చేస్తున్న నకిలీ కానిస్టేబుల్‌ వెనుక అసలు పోలీస్‌ ఉన్నాడు. నకిలీ కానిస్టేబుల్‌ను విచారించడంతో ఈ విషయం బయటపడింది. ఆరిలోవ ఎస్‌ఐ జి.అప్పారావు తెలిపిన వివరాలివీ.. ఈ నెల 11న పెందుర్తికి చెందిన ఓ యువకుడు తన స్నేహితురాలితో కలసి రుషికొండ బీచ్‌కు వెళ్లాడు. అక్కడ వారిద్దరూ కలిసి కూర్చొని మాట్లాడుతుండగా.. నగరంలో ఊటగెడ్డకు చెందిన మొదిరి సునీల్‌ తాను కానిస్టేబుల్‌ అంటూ అక్కడకు వెళ్లాడు. 'మీ ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకెళతా.. లేకుండా డబ్బులు ఇవ్వండి' అంటూ బెదిరించాడు. ఆ యువకుడు తన వద్ద ఉన్న రూ.11వేలను సునీల్‌కు ఇచ్చేశాడు. ఆ తర్వాత అనుమానం రావడంతో ఆ యువకుడు ఈ నెల 19న మళ్లీ రుషికొండ బీచ్‌కు వెళ్లి నిఘా పెట్టాడు. ఆ నకిలీ కానిస్టేబుల్‌ ఆ యువకుడి వద్దకు వచ్చి యథావిధిగా డబ్బులు డిమాండ్‌ చేశాడు. కొందరు సందర్శకులతో కలసి ఆ యువకుడు నకిలీ కానిస్టేబుల్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. సునీల్‌ను పోలీసులు ప్రశ్నించడంతో ఓ కానిస్టేబుల్‌ భాగోతం బయటపడింది. దిశ పోలీస్‌ స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్‌ సహకారంతో తాను బీచ్‌ల్లో కొన్నాళ్లుగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సునీల్‌ వెల్లడించారు. ఈ మొత్తాన్ని ఇద్దరం పంచుకుంటున్నట్లు తెలియజేశాడు. దిశ పోలీస్‌స్టేషన్‌ పీఎంపాలెం పరిధిలో ఉండటంతో.. ఆ కానిస్టేబుల్‌ కేసును అక్కడి పోలీసులకు అప్పగించారు. కాగా.. సునీల్‌ను అరెస్ట్‌ చేసి స్టేషన్‌ బెయిల్‌ ఇచ్చారు. కేసును ఎస్‌ఐ అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు.

# వందే భారత్‌లో స్వచ్ఛతకు మంగళం

**రైలును అపరిశుభ్రంగా మార్చేసిన ప్రయాణికులు**





వందేభారత్‌ రైలులో ఇదీ పరిస్థితి..



విరిగిన కుర్చీ

**సాక్షి, విశాఖపట్నం :** ఓవైపు ఇండియా.. స్వచ్ఛతలో ప్రపంచ దేశాలకు దిక్సూచీగా మారేందుకు పరుగులు పెడుతుంటే.. కొందరిలో మాత్రం పరిశుభ్రతపై పూర్తిస్థాయిలో అవగాహన కొరవడుతోంది. ఇటీవల ప్రారంభమైన సెమీ హైస్పీడ్‌ రైలు వందేభారత్‌లో పరిస్థితి దీనికి అద్దం పడుతోంది. సికింద్రాబాద్‌ నుంచి విశాఖ వచ్చిన వందేభారత్‌ రైలులో టన్నుల కొద్దీ వ్యర్థాలు పోగవుతున్నాయి. తినుబండారాలు కిందపడేస్తూ రైలులోని ప్రతి కోచ్‌ను అపరిశుభ్రంగా మార్చేస్తున్నారు. విశాఖ వచ్చేసరికి వందేభారత్‌ రైలు కాస్తా చెత్తబుట్టగా మారిపోతుంది. విషయం తెలుసుకున్న వాల్తేరు డీఆర్‌ఎం అనూప్‌కుమార్‌ సత్పతి ఆవేదన వ్యక్తం చేశారు. రైలును పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత రైల్వే సిబ్బందిపైనే కాకుండా.. ప్రతి ఒక్క ప్రయాణికుడిపైనా ఉందని సూచించారు.

# ముగిసిన సాంస్కృతిక ఉత్సవాలు

**ఏయూక్యాంపస్‌:** ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న సెంట్రల్‌ రెవెన్యూ స్పోర్ట్స్‌–కల్చరల్‌ బోర్డ్‌ సౌత్‌జోన్‌ కల్చరల్‌ మీట్‌ 2022 ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఏయూ కన్వెన్షన్‌ సెంటర్‌ వేదికగా మూడు రోజుల పాటు ఉత్సాహంగా కార్యక్రమాలు జరిగాయి. వివిధ పోటీ ల్లో విజేతలకు సీజీఎస్టీ చీఫ్‌ కమిషనర్‌ సంజయ్‌ పంత్‌ బహుమతులు ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, గోవా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు చెందిన ఇన్‌కంట్యాక్స్, కస్టమ్స్, సీజీఎస్టీ, సెంట్రల్‌ ట్యాక్స్‌ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు.. 14 విభాగాల్లో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటారు.



విజేతలతో సీజీఎస్టీ చీఫ్‌ కమిషనర్‌ సంజయ్‌ పంత్‌

# వైఎస్సార్‌ హ్యాండీక్రాఫ్ట్‌ బజార్ల ఏర్పాటుకు చర్యలు

**దాబాగార్డెన్స్‌(విశాఖ దక్షిణ):** రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ బడిగించల విజయలక్ష్మి ఆదివారం కేజీహెచ్‌ డౌన్‌రోడ్డులోని లేపాక్షి ఎంపోరియంను సందర్శించారు. హస్తకళాకారులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు పరిశీలించి.. వ్యాపారాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖలో రెండో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 17 ఎంపోరియంలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి అనుమతితో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో వైఎస్సార్‌ హ్యాండీక్రాఫ్ట్‌ బజార్లు ఏర్పాటు చేసి.. హస్తకళాకారులు తయారు చేసిన వస్తువులు నేరుగా విక్రయించే వెసులుబాటు కల్పిస్తామన్నారు.



హస్తకళాకారులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు ప్రదర్శిస్తున్న విజయలక్ష్మి, తదితరులు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, ఏపీహెచ్‌డీసీ డైరెక్టర్‌ పైడి రమణ, లేపాక్షి ఎంపోరియం మేనేజర్‌ కె.విజయగౌరీ దేవి, సిబ్బంది దయానందకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

## వహ్వా.. బ్యూటీ.. క్యూటీ



ర్యాంపులపై హొయలొలుకుతున్న వైజాగ్ బ్యూటీలు

ఈవెంట్ డైరెక్టర్ వీరుమామా ఆధ్వర్యంలో స్టేషన్ రోడ్‌లోని బెస్ట్ వెస్ట్రన్ తేజ్ వివాన్‌లో ఆదివారం నిర్వహించిన డాజ్లింగ్ బ్యూటీస్ మెగా ఫైనల్ ఫ్యాషన్ షో ఆహూతులను ఆకట్టుకుంది. నగరానికి చెందిన అందమైన భామలు, చిట్టి పొట్టి చిన్నారులు ర్యాంప్‌పై తమ దైన శైలిలో వాక్ చేసి అలరించారు. ట్రాఫిక్ భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

- తాటిచెట్లపాలెం

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







# చక్కనైన సర్దుబాటు..!

- తీరిన సబ్జెక్టు టీచర్ల కొరత
- అర్హతలకు అదనపు ప్రోత్సాహకం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 733 మందికి లబ్ధి
- కొత్త స్థానాల్లో నేటి నుంచి విధులు

**విశాఖ విద్య:** ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరింది. అర్హత గల సెకండరీ గ్రేడ్(ఎస్జీటీ) టీచర్లకు స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పిస్తూ, వారిని హైస్కూళ్లలో తాత్కాలికంగా సర్దుబాటు చేశారు. కొంతమంది అవకాశవాద చర్యలతో బదిలీలు, ఉద్యోగోన్నతులకు బ్రేక్ పడినప్పటికీ, ఉపాధ్యాయులకు మేలు చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని 733 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు దీని వల్ల మేలు జరిగింది. సబ్జెక్టు టీచర్ల నియామకంతో హైస్కూళ్లలో విద్యార్థులకు బోధన మెరుగుపడనుంది. సర్దుబాటు ద్వారా పనిచేసే ఉపాధ్యాయులకు సైతం నెలకు రూ.2,500లు అదనపు ప్రోత్సాహకం లభించనుంది. అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉండేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతుంది.

**సబ్జెక్టుల వారీగా సర్దుబాటు ఇలా..**

గణితం-142, ఫిజికల్ సైన్స్-94, బయోలాజికల్ సైన్స్-71, సోషల్ సైన్స్-104, ఇంగ్లిష్-33, తెలుగు-51, హిందీ-44తో పాటు సబ్జెక్టు కన్వర్షన్ కింద మరో పది పోస్టుల్లో సర్దుబాటు ప్రాతిపదికన ఎస్జీటీలను హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్‌గా నియమించారు. వీరితోపాటు గత అక్టోబర్‌లో అంగీకార పత్రాలను తీసుకున్న వారిలో ఇంగ్లిష్-156, బయోలాజికల్ సైన్స్-28 మందికి అడహక్ ఉద్యోగోన్నతులు ఇచ్చారు. వీరంతా సోమవారం నుంచి కొత్త ప్రదేశాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.


హైస్కూల్‌లో విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయురాలు

### పారదర్శకంగా సర్దుబాటు



హైస్కూళ్లలో నైపుణ్యతతో కూడిన చదువులు సాగాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా అర్హత గల ఎస్జీటీలను సీనియార్టీ ప్రాతిపదికన హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లగా సర్దుబాటు చేశాం. సీనియార్టీ జాబితాలను ప్రదర్శించి, అందరికీ ఆమోదకరంగా పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించాం. పదో తరగతి పరీక్షల దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన ఇలాంటి ఏర్పాట్లు చేశాం.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

### రెగ్యులర్ స్కేలు ఇస్తే మరింత మేలు



అర్హత గల ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ హోదాలో హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లుగా నియమించటం మంచి నిర్ణయమే. డీఈవో కార్యాలయ అధికారులు అంతా పారదర్శకంగానే సర్దుబాటు ప్రక్రియ నిర్వహించారు. అయితే శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పిస్తే మరింత మేలు జరుగుతుంది.

-కొమ్మనాపల్లి నాగేశ్వరరావు, పీఆర్టీయూ కార్యదర్శి, విశాఖ జిల్లా

### మంచి నిర్ణయమే..



హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత తీరేలా ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. సీనియార్టీ జాబితా ముందుగానే ప్రకటించింది. దీనివల్ల పారదర్శకత పెరిగింది. ఇది హర్షించదగ్గదే. అయితే ఉద్యోగోన్నతి కోసమని విల్లింగ్ తీసుకున్న వారికి రెగ్యులర్ స్కేల్ వర్తింప జేస్తే బాగుంటుంది.


– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ, రాష్ట్ర కౌన్సిలర్

### విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా..



ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులందరికి నెలవారీ ఉద్యోగోన్నతులు కల్పించాలనే కృతనిశ్చయంతో అధికారులు ముందుకెళ్తున్నా.. కావాలనే కొందరు అవాంతరాలు సృష్టిస్తూ వాటిని అడ్డుకుంటున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని చేసిన ఇలాంటి సర్దుబాటు మంచి పరిణామం. హైస్కూళ్లలో బోధన మెరుగుపడుతుంది.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, ఉమ్మడి విశాఖ జిల్లా



- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్- హ్యాండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ నుంచి కనిపించిన సుందర దృశ్యం ఇది. భానుడు ఆకాశాన్ని రంగుల కాన్వాస్‌గా మార్చి భారీ జెయింట్ వీల్.. చెట్ల మధ్య నుంచి కాషాయవర్ణ శోభితుడై ఇలా కెమెరా కంటికి చిక్కాడు.

# ఏసీఏ జట్టుకు మధురవాడ బాలుడు

- బొట్టవానిపాలేనికి చెందిన భాను స్వరూప్ ఎంపిక
- అండర్-14 జట్టుకు ప్రాతినిథ్యం

**మధురవాడ(భీమిలి):** మధురవాడ బొట్టవానిపాలేనికి చెందిన ముగడ భానుస్వరూప్ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-14 జట్టులో చోటు సంపాదించాడు. భానుస్వరూప్ ప్రస్తుతం బక్కన్నపాలెం సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి రమణ లారీ యజమాని. చిన్నప్పుడే కుమారుడి ఆసక్తిని గమనించిన రమణ.. తమకు తెలిసిన వారి దగ్గర క్రికెట్‌లో శిక్షణ ఇప్పించాడు. అనంతరం పక్కనే ఉన్న పీఎం పాలెంలో స్టేడియం ఉండటంతో.. విశాఖ క్రికెట్ అసోసియేషన్‌లో చేర్పించాడు. అప్పటి నుంచి భానుస్వరూప్ టోర్నమెంట్‌లలో పాల్గొంటూ ప్రతిభ చూపేవాడు. ఈక్రమంలో గతేడాది వీడీసీఏలో స్థానం సంపాదించాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా, బ్యాటింగ్‌లో రాణిస్తూ.. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-14 జట్టులో స్థానం సంపాదించాడు. ప్రస్తుతం కేరళలో దక్షిణాది రాష్ట్రాల జట్ల మధ్య జరుగుతున్న పోటీల్లో ఏసీఏ తరపున భానుస్వరూప్ పాల్గొంటున్నాడు. భానుస్వరూప్ మాట్లాడుతూ.. 'నాకు క్రికెట్‌పై ఉన్న ఇష్టాన్ని గమనించిన మా నాన్న.. నన్ను బాగా ప్రోత్సహించారు. వీడీసీఏలోని కోచ్‌లు, పెద్దల సూచనలు, ప్రోత్సాహంతో మరింత పట్టుదలగా ఆడుతున్నాను. నాకు రవీంద్ర జడేజా అంటే చాలా ఇష్టం. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని జాతీయ జట్టులో ఆడాలనేది నా కల. దాన్ని నిజం చేసుకుంటా'అని చెప్పాడు.


అండర్-14 జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న ముగడ భాను స్వరూప్

### నగరంలో నేడు

- ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ మేయర్ నిర్వహిస్తారు. టోల్‌ఫ్రీ నెంబరు 180042500009కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలపవచ్చు.
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు.
- ఉదయం 9.30 గంటలకు తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖనంపై పోటీలు

### విశాఖ బులియన్

| | |
|---|---|
| 24 క్యారెట్స్(10 గ్రా.) | రూ.57,060 |
| 22 క్యారెట్స్(10 గ్రా.) | రూ.52,250 |
| వెండి(కిలో): | రూ.74,300 |



## పద్మశాలి సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

**సీతంపేట:** పద్మశాలి కులస్తుల విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శంకరమఠం రోడ్‌లో పద్మశాలి భవనంలో జరిగింది. గౌరవాధ్యక్షునిగా కొప్పుల రమేష్, అధ్యక్షునిగా వానపల్లి ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సూరిశెట్టి సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా వానపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పెంటపల్లి సత్యనారాయణ, పప్పు శ్రీనివాసరావు, నీలిరవి, కోశాధికారిగా నామాల అనేష్ కుమార్, మహిళాధ్యక్షురాలిగా గాయత్రి ఫణి కుమారి, యువత అధ్యక్షునిగా కొండపల్లి సతీష్, గౌరవ సలహాదారులుగా కులపాక సన్యాసిరావు, కరణం వెంకటేశ్వరరావు, చిక్కాల సత్యనారాయణ, రాపర్తి సుబ్బారావు,కల్లూరి రామ్మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. అఖిల భారత పద్మసాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, కోస్తాంధ్ర అధ్యక్షుడు జి.వి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు గడ్డం జగన్నాథం, వానపల్లి వెంకరావు, ఆప్కోస్ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణశ్రీనివాస్, నెడ్ క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి హాజరయ్యారు.

## ఐఐఎంలో వ్యాపారవృద్ధిపై వార్షిక సదస్సు



వ్యాపార వార్షిక సదస్సులో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులు

- ప్రముఖ వ్యాపారసంస్థల ప్రతినిధులు హాజరు
- వ్యాపార పురోభివృద్ధిపై యువతకు దిశానిర్దేశం

**ఆనందపురం:** మండలంలోని గంభీరంలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-విశాఖ (ఐఐఎంవీ)లో రెండురోజులు విశాఖపట్నం యువ వ్యాపారవేత్తల కోసం నిర్వహించిన వ్యాపారవృద్ధి వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది. సదస్సులో మొదటిరోజు శనివారం సరిహద్దులులేని వ్యాపారం, వృద్ధి తదితర అంశాలపైన, ఆదివారం వ్యాపారంలో భవిష్యత్తు అవసరాలు, సంపదసృష్టిపైన రెండు ప్యానల్స్‌గా చర్చించారు. ఈ సందర్భంగా ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం 25 శాతం వరకు అంకురసంస్థలు ఫిన్-టెక్ (సాంకేతిక సహాయకారి)లపై ఆధారపడి ఉన్నాయని చెప్పారు. దీనిపై ఐఐఎంవీ ఫోకస్‌పెట్టి యువ వ్యాపారవేత్తలను తదనుగుణంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రైడ్ ప్రోగ్రాం ద్వారా యువతలో వ్యవస్థాపక మనస్తత్వాలను పెంపొందించడంపై దృష్టి సారించామన్నారు. వ్యాపారరంగంలో వస్తుసరఫరా, ఇతర ప్రాంతాలకు విస్తరించడం, నిర్వహణ, వ్యాపార విశ్లేషణ వంటి అంశాలు చర్చించి యువతను కార్యోన్ముఖుల్ని చేస్తున్నట్లు చెప్పారు. మొదట ప్యానల్ సదస్సులో ప్రొఫెసర్ ప్రియల్‌రాత్ సన్యాల్, ప్రొఫెసర్ ప్రీతివిర్ది మాట్లాడుతూ వ్యాపార రంగం విస్తరించడానికి హద్దులు ఉండవన్నారు. ప్రస్తుతం ప్రాచుర్యం పొందుతున్న ఈ-కామర్స్, వీడియో కామర్స్‌కు అనుగుణంగా వ్యాపారరంగంలో మార్పులు తేగలిగితే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఈ చర్చలో గోద్రెజ్ కంపెనీ ప్రతినిధి రాధికా సుబ్రహ్మణియన్, నెల్సనల్ క్యూ కంపెనీ ప్రతినిధి మనీష్‌గుప్తా, టాటా మోటార్స్ కంపెనీ ప్రతినిధి హరిప్రకాష్ పాల్గొన్నారు. రెండోప్యానల్ చర్చలో వ్యాపారరంగంలో ఫిన్‌టెక్ ప్రాముఖ్యత, దాని పరిణామం, ప్రస్తుతం-భవిష్యత్తులో దానివలన కలిగే అవకాశాలు, డబ్బు విలువను ఎలా సృష్టిస్తుంది, వ్యాపారం పునర్నిర్మించడంతో ఆవిష్కరణ, స్థూల పర్యావరణ వంటి అంశాలపై చర్చించారు. వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని వ్యాపారరంగంలో తీసుకురావలసిన మార్పుల గురించి మాట్లాడారు. వస్తువుకు ఇమేజ్ తీసుకురావడం, పలు వస్తువుల కలయికతో కొత్త వస్తువులను సృష్టించడం, మార్కెట్‌లో వస్తువులకు డిమాండ్ అంచనా వేయడం, అందుకనుగుణంగా ఉత్పత్తి చేయడం వంటి అంశాలపై పరిపక్వతను ఎలా కలిగి ఉండాలన్న అంశాలను చర్చించారు. ఇందులో సీఎఫ్‌వో ప్రతినిధి గౌరవ్ సెహగల్, సిగ్మా అడ్వయిజరీ సీఈవో హర్షిత్‌జైన్, వెల్స్ ఫార్గో వైస్‌ప్రెసిడెండ్ శివకుమార్, ఐసీఐసీఐ ప్రతినిధి అనుజ్ సునేజా పాల్గొన్నారు.

## హిందూ సంప్రదాయాన్ని చాటిచెబుదాం

కంచి కామకోటి పీఠాధిపతి

**సీతంపేట:** హిందూ సంప్రదాయాలు చాటిచెప్పేలా దేవదాయ శాఖ అధికారులు ఉత్సవాలు నిర్వహించాలని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. శంకరమఠంలో ఆదివారం దేవదాయ శాఖ జిల్లా అధికారులతో జరిగిన కార్యక్రమంలో ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కాగా.. మా ఘమాసం ప్రారంభం కావడంతో సూర్యనారాయణమూర్తికి భక్తులు సూర్య నమస్కారాలు చేశారు. సహస్ర గాయత్రి మంత్ర జపం, దంపతులచే గాయత్రి మాత పూజ నిర్వహించారు. శంకరమఠం కార్యవర్గం కార్యక్రమాలను పర్యవేక్షించింది.


అనుగ్రహ భాషణం చేస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

# ఆరోగ్య ఆహార ప్రయాణం

- భార్య ఆరోగ్యం కోసం భర్త ప్రయత్నం
- ఆ ఆలోచనల్లోంచి పుట్టిందే 'అవినాష్'
- సిరిధాన్యాలతో చపాతీ పిండి తయారీ




అవినాష్ సంస్థ నిర్వాహకులు ప్రజ్ఞానంద్, సాయిపద్మ


సిరిధాన్యాలతో రొట్టెల తయారీ


అవినాష్ సంస్థ తయారు చేస్తున్న ఉత్పత్తులు

**ఏయూక్యాంపస్:** తన భార్య ఆరోగ్యం కోసం మంచి ఆహారం అందించాలని ఓ భర్తకు వచ్చిన ఆలోచన.. నూతన స్టార్టప్‌ను ప్రారంభించే దిశగా నడిపించింది. ఆహారమే ఔషధంగా పని చేస్తుందని నిరూపించి.. చేసే పనిలో విజయవంతమయ్యారు ప్రజ్ఞానంద్. తన భార్య సాయిపద్మకు సంపూర్ణ ఆరోగ్యం అందిస్తూ.. పలువురు మహిళలకు ఉపాధి కల్పిస్తూ.. స్టార్టప్ సంస్థ అవినాష్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సిరిధాన్యాలతో సులభంగా రొట్టెలు చేసుకునే విధానాన్ని ఆయన రూపొందించారు. ఇందుకు పేటెంట్ కోసం దరఖాస్తు కూడా చేశారు. వృత్తిరీత్యా దేశవ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో నివసించిన ప్రజ్ఞానంద్.. ప్రస్తుతం విశాఖలో స్థిరపడి ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే పనిలో తలమునకలై ఉన్నారు.

ఏయూలో ప్రజ్ఞానంద్ 2014లో యోగాలో పీజీ కోర్సు పూర్తి చేసి బంగారు పతకం సాధించారు. యోగా అభ్యాసకుడిగా, శిక్షకుడిగా మారారు. తన భార్య సాయిపద్మకు ఉన్న ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి, సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా తీర్చిదిద్దడానికి యోగా, ఆహారంపై విస్తృతంగా అధ్యయనం చేశారు. శరీరంలో డిటాక్సిఫికేషన్ (నిర్విషీకరణ)కు వివిధ జ్యూస్‌లు సహజ సిద్ధంగా తయారుచేయడం, వినియోగించడం, ఫలితాలు బేరుజు వేసుకుంటూ ముందుకు సాగారు. తద్వారా ఆరోగ్య ఆహార ప్రయాణాన్ని ప్రారంభించారు. తన భార్య ఆరోగ్యం గణనీయంగా మెరుగవడంతో దీనిని అందరికీ పంచాలనే ఉద్దేశంతో ముందడుగు వేశారు.

**చపాతీ పిండి తయారీ**

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సిరిధాన్యాలతో రొట్టెల తయారీ కొంత సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం ప్రజ్ఞానంద్ సొంతంగా ఓ విధానం రూపొందించారు. మైదా, గోధుమ పిండి కలపకుండా కేవలం సిరిధాన్యాల పిండికి, కొద్ది మోతాదుల్లో వివిధ మూలికల పొడి, కూరగాయల పొడిని జోడించి సులభంగా రొట్టెలు తయారు చేస్తున్నారు. దీని పేటెంట్ కోసం దరఖాస్తు చేశారు. ప్రస్తుతం ఆర్డర్‌పై రొట్టెలు తయారు చేసి అందించడం, విడిగా పొడిని విక్రయిస్తున్నారు. సిరిధాన్యాలతో చపాతీ పిండి తయారీ విజయవంతం కావడానికి దాదాపు 800 కిలోల పిండిని వినియోగించి, వివిధ రూపాల్లో ప్రయోగాలు చేశారు.

**రైతులతో జతకట్టారు**

తనకు అవసరమైన సిరిధాన్యాలను ప్రకృతి విధానంలో సాగుకు రైతులతో జతకట్టారు. ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించి ఆర్గానిక్ విధానంలో వీటిని పండించే విధంగా ప్రోత్సహిస్తున్నారు. రైతులకు మద్దతు ధరకంటే అధికంగా అందజేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తూ.. సిరిధాన్యాలు సేకరిస్తున్నారు. అత్యధిక పోషకాలు జింక్, ఐరన్ కలిగిన ఇంద్రావతి రాగిని రైతులతో సాగు చేయిస్తున్నారు.

**విభిన్న ఉత్పత్తులు :** ప్రస్తుతం చపాతీ పిండితో పాటు, రవ్వ, ఇడ్లీ, దోశ పిండి, సిరిధాన్యాలతో చేసిన లడ్డూలు, నూడిల్స్, సజ్జలతో చేసిన అప్పడాలు, పిజ్జాకు వినియోగించే బేస్ వంటివి తయారు చేసి వాణిజ్యపరంగా తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ఉత్పత్తుల్లో పాయసం, మిక్చర్, కుకీస్, బిస్కెట్లు, పనసకాయ-మిల్లెట్స్ బిరియాని, బీట్‌రూట్ లడ్డూ బాగా ఫేమస్. ఈ రంగంలో పనిచేస్తున్న ఇతర స్టార్టప్ సంస్థల నుంచి కూడా కొన్ని ఉత్పత్తులు తీసుకువచ్చి.. సమష్టిగా పనిచేయాలనే సందేశాన్ని చాటుతున్నారు.

**రూ.22 లక్షల స్టార్టప్ గ్రాంట్ విడుదల**

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ తరఫున వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రజ్ఞానంద్ చేస్తున్న కృషిని గుర్తించి రూ.22లక్షల స్టార్టప్ గ్రాంట్‌ను మంజూరు చేసింది. తొలి విడతగా 8.8 లక్షలు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని వినియోగించి వాణిజ్య విధానంలో సిరిధాన్యాలతో రొట్టెలు తయారు చేసే యంత్రాన్ని రూపొందించే పనిలో ప్రజ్ఞానంద్ ఉన్నారు. అవినాష్ సంస్థలో పనిచేసే వారంతా మహిళలే కావడం విశేషం. వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మహిళలకు ఆర్థిక స్వావలంబన అందించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది.